# * మా సంసారాలు

" ప్రియమైన తమ్ముడికి,

ఈమధ్య నేను చేసిన ఒకపరిశోధనసంగతులు నీకు తెలియజెయ్యాలని బుద్ధిపుట్టి, దీనివల్ల నీకు కలిగే లాభ మేదేనా వుంటే కలుగుతుందనీ, యీ వుత్తరం, అనేకపనుల్లో తెరిపిచేసుకుని రాస్తున్నా—

" నేను యెన్నోమార్లు అనుకున్నాను, ఆడదాని సంసారం చాలకష్టమనీ, మొగవాడి పనిలాగు సుళువైనది కాదనీ, మొగవాడిపని యేముంది—యిట్టే భోంచెయ్యడం, వెళ్లడం, ఆఫీసులో కూచోడం, యింటికిరావడం; ఆడదో మరి, పొద్దున్న అయిదు మొదలు రాత్రి పదకొండింటివరకూ తెరిపిలేకుండా కాలు వంచడానికేనా వీలులేకుండా, నడుమువాల్చడానికేనా అవకాశం లేకుండా పనిచేస్తూవుండవలసిందే అని. అంచేత యెప్పుడూ మాఆవిడే నాకంటే యెక్కువ కష్టపడుతూందనీ, పాపం ! దాని ఋణం నేను యెప్పటికీ తీర్చుకోలేననీ అనుకునేవాణ్ణి. కాని యెప్పుడెప్పుడేనా కొంచెం పరిశీలించి చూసేవాణ్ణి. చూస్తే యెంత సేపూ కడిగిందే కడగడం, తుడిచిందే తుడవడం, చేసిందే చెయ్యడం అని అనిపించేది. అయినా నాపరిశీలనే తప్పని నాలో నేను బుద్ధిచెప్పుగుని వూరుకునేవాణ్ణి. ఈపరిశీలనయినా యెందుకొచ్చేదంటే, ఎప్పుడేనా 'ఈ పుస్తకం చదువు, ఇది యెంతో బాగుంటుంది, ఇది చదువు' అనేవాణ్ణి. కాని ఆపుస్తకం మొదటి పుటేనా యెప్పుడూ తిప్పివుండడం నేను చూసివుండలేదు. అంతటితో ఆపుస్తకంమీద నాకూ, దానికీ కూడా విరక్తి పుట్టి

* భారతి - ఆగష్టు 1933

పోయేది. 'పోనీ, నువ్వు పుస్తకాలు చదవక్కర్లేదులే. ఇంటికి తెప్పిస్తున్నా ఆంధ్రపత్రిక చదువు, చాలు. నాకు అంతకంటే నువ్వు మరేమీ వుపకారం చెయ్యక్కర్లేదు. అసలు నువ్వుకూడా చదవడానికనే నేను తెలుగుపత్రిక తెప్పిస్తున్నాను' అని అనేక సార్లు చెప్పేను. కాని అ పత్రికేనా అది చదవగా నేను యెన్నడూ చూసివుండ లేదు. 'పాపం! పని తెరిపి లేదు, అంచేత చదవలేదు' అని అనుకునేవాణ్ణి. అంతేకాని మరొకమోస్తరుగా బద్ధకమనిగాని, పనులు తెమల్చుకో లేదని కాని యెన్నడూ అనుకో లేదు. ఎప్పుడెప్పుడేనా మీవదిన కుచ్చెల కథ తీసేది. అదేనా నాలుగు బంతులు చదివేది. అంతటితో సరదా, ఉత్సాహం తగ్గిపోయేవి. ఏకోడుకు వెధవో చదవనియ్యకుండా వున్నాడు, ఈ వెధవలతో చదువేమిటి నామొహ మని వాళ్లని నాలుగు తిట్టి చరుపులు చరిచి ఆపుస్తకం ఒకమూలకి గిరవాటేసేది. ఈ మోస్తరుగా నడిచింది కాలం.

"ఆమధ్య మా మామగారు 'కూతురినీ, పిల్లలినీ ఒక మారు మావూరు పంపించు, నాలుగురోజు లిక్కడుండి వస్తారు' అని వుత్తరం రాసేడు. 'నేను అనేకపనుల్లో వుంటున్నాను. నా కిప్పుడు వీలులేదు" అని చెప్పి వుత్తరం రాసెయ్యా లను కున్నాను. కాని 'ఇంతకంటే మనకు మరొకప్పుడుమట్టుగు తెరిపి తగలడతుందా' అని అనిపించీ, ఇంతకీ మరొక కారణముంది కూడా, మరేం లేదు, నే నొక్కడినీ సంసారం చేసిచూస్తే యెలాగుంటుందో, మాఆవిడ పడ్డ కష్టాలన్నీ నేనూ పడి తెలుసు కుందామనీ యోచనకలిగి, ముఖ్యంగా యీ పరిశోధనకోసమే దాన్ని పుట్టింటికి పంపేసేను. వెళ్లేటప్పుడు అది పిల్లలనందరినీ తనతో తీసికెళతానంది. కాని నేనే వాళ్లని విడిచిపెట్టలేక పెద్ద

వాణ్ణిమాత్రం నాదగ్గిర వుంచుకొని చిన్నవాళ్ల నిద్దరినీ తనతో
తీసికెళ్లమన్నాను. పెద్దవాణ్ణి నాదగ్గిరే వుంచుకొన్నాను. వెళ్లే
ముందరే మీవదిన నన్ను 'ఒటేల్లో జేరిపొండి. లేకపోతే మీరు
నెగ్గలేరు. పోనీఅంటే ఆవు, దూడ వున్నాయి. వాటికి చాకిరీ
చెయ్యాలి. ఈపాట్లు పడలేరు. వంట గింట పెట్టుకోకండి. ఆ
వెధవకుక్కరు మళ్లా పైకి తీస్తారేమో' అంటూ హితంచెప్పింది.
నేను అన్నిటికీ 'ఉ' కొట్టేను. అదీ వెళ్లిపోయేక కుక్కరు పైకితీసి
వండుకోడం ప్రారంభించేను. కుక్కరుసంగతి నీకు తెలియనే
తెలుసు, అదెంతసుఖవో. అమృతంలా వుంటుంది వచనం.
అయిదునిమిషాలపని, అంతే.

"నా కొత్తసంసారంలో నౌకరివాడు తనపని తను చేసుకు
పోయేవాడు, దాసీది దానిపని అది చేసుకుపోయేది. ఆచార
వ్యవహారాల్లో మీవదినెపనికీ, నా పనికీ యెంతేనా భేదముంది.
తను అంటూ సంటూ అని పేరు చెప్పి, గిన్నెతగిలినా తగలక
పోయినా సరే, చేతులు కడుక్కునేది. మరి నేనో, అంట్లగిన్నెలు
ముట్టుగున్నా సరే ఛేతి కేదేనా అంటుగుంటేనే చెయ్యి కడు
క్కునేవాణ్ణి. కాని లేకపోతే మానేసేవాణ్ణి. ఈ మోస్తరుగా
నీళ్లఖర్చు తగ్గిపోయింది. ఇల్లు యెప్పుడూ తేమగా వుండక,
పొడిగా శుభ్రంగా వుండేది. నీటిలో మునిగితేలుతూ వుండక
పోడంవల్ల నా కాళ్లూ చేతులూ వొరిసిపోలేదు.

"మీ వదినకి యిరవైయారు రకాల మడి. తలకు నీళ్లుపోసు
కుంటే ముట్టుగోవచ్చు కొన్ని. కంఠస్నానం చేస్తే ముట్టుగో
వచ్చు మరికొన్ని. మడిబట్ట కట్టుకుంటే ముట్టుగోవచ్చు కొన్ని.
బట్ట లేకుంటే - దానికే పెద్దమడి అనిపేరు-ముట్టుగోవచ్చు మరి
కొన్ని. నాతో యిన్ని రకాల మడి లేదు. చెయ్యి శుభ్రంగా

వుంటేసరి, అన్నివస్తువులూ ముట్టుగోవచ్చు. అంతా వొక్క మడే. ఇన్నిరకాల మడి వున్నా మీవదినెకి కొన్నికొన్ని రోజుల్లో కొన్నికొన్ని పనికిరావట! ఆదివారంనాడు వుసిరీవచ్చడి ముట్టుగోదు! అమావాస్యనాడు పెద్ద బచ్చలికూర వండదు! నాతో యిలాంటి చిక్కు లేమీ లేవు. పైఆచారాల్లో వేటినీ నేను పాటించలేదు, జ్ఞానవంతులిని నమ్మించగలిగిన అంశం వాటిలో వొకటీ లేదు కాబట్టి.

"మీ వదిన యెప్పుడూ దాసీదాన్ని రాచ్చిప్పలూ, రుబ్బురోలూ, పాలకుండా కడగనిచ్చేదికాదు. ఆచారానికి పనికిరాదుట! కాని తక్కినవాటికీ వీటికీ భేదం నాకేమీ కనబడనందువల్ల వాటినికూడా దాసీదానిచేతే కడిగించేవాణ్ణి, తరవాతి సంగతేమైతే అదవుతుందని. ఎవళ్లమట్టుకు వాళ్లు వాళ్ల పనులన్నీ చేసుకుపోతూవుండేవాళ్లు. కొసకి కూరలదానితోనైనా నే నెప్పుడూ రెండుమాటలకంటే యెక్కువ ఆడి యెరగను. ఆఖరికి నా కనిపించింది, ఆడసంసారమంటే యెంతసుఖమో అని, యెంతసుళువో అనీ, మొగవాడు పడేపాటులో యిది యెన్నోవంతో అనీ. ఎటొచ్చీ సాయంత్రం షికారుమట్టుకు నష్టపోయేవాణ్ణి. ఎంచేతంటే, పనిచేసే మనిషి అంట్లకోసం ఆ వేళకే వస్తుంది. అటుతర్వాత దూడలు వస్తాయి. పాలుతీసేవాడు వస్తాడు. అంచేత సాయింత్రం షికారువెళ్లడానికి వీలులేకపోయేది. పొద్దున్న వెళ్లడానికీ వీలుండేదికాదు. అదొక్కటే యిబ్బందని అనిపించింది,

"చెబితే నువ్వు నమ్ముతావో నమ్మవో - మీవదినె యింట్లో లేకపోయింది, ఎన్నిపనులు చేసుగోవలసి వచ్చిందో అని నాకు ఒక్కనాడేనా అనిపించలేదు. ఆవూళ్లో అదీ పిల్లలూ

క్షేమంగా వున్నారో లేదో అన్నమాటేగాని మరేమీ నాకని పించలేదు. ఇలాగుంటూ వుండగా—రెణ్ణెలయింది అది వెళ్లి—మామగారి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది—'మీవూరికి పిల్లను పంపిస్తున్నాను. రైలు మీవూరికి రాత్రి పదింటికి వస్తుంది. పిల్లల తోటి వస్తూందికాబట్టి నువ్వు రైలు స్టేషనికి వచ్చి జాగ్రత్తగా వాళ్లని యింటికి తీసుకువెళ్ల వలసింది' అని. 'సరే' అని అను కున్నాను. అది వచ్చేరోజున నేను ట్రెయినికి వెళ్లేను. పిల్లాడితో కూడా ట్రయినుమీద వచ్చింది. అందరం యింటికి ఎద్దుబండి మీద వచ్చేసేం. పిల్లలూ తనూ వాళ్ళవూళ్లోనే సాయంత్రం భోంచేసి రైలెక్కు తారని యెరిగివుండడంవల్ల నేను వాళ్లకి వంట ప్రయత్నం చెయ్యలేదు. ఏదో కబుర్లన్నీ చెప్పాగున్నాం. ఇంత ట్లోకి తను లాంతరుపట్టుగొచ్చి 'మీచెయ్యి ఇలా చూపించండి' అంది. 'ఏమీ యెందు' కన్నాను. 'చూపిద్దురూ, యెందుకో' అంది పెళ్లానికి గాక మరి వూళ్లోవాళ్ళకా చనువని చెయ్యి చూపించేను. చూసింది. 'ఆచెయ్యి యియ్యండి' అంది. ఇచ్చేను. 'ఏదీ కాళ్లు చూపించండి' అంది. 'ఎందుకూ' అంటూ కాళ్లు కూడ చూపించేను, చూసి ఆశ్చర్యంతో 'మీకాళ్లూ, చేతులూ యీపాటికి వోరిసిపోయి నాకాళ్లూ, చేతులులాగే వుంటా యను కున్నాను' అంది. ఇంటిదగ్గిర వంటచేసుగుంటున్నానని నేను వెనకే వొకవుత్తరంలో రాసేనులే. 'అయితే యెలాగున్నా' యన్నాను. 'రాళ్లలాగున్నా' యంది. 'అదే మొగాడి సంసా రానికీ, ఆడదాని సంసారానికీ భేద' మన్నాను. 'మీ అనా చారవు పనులుచూస్తే నీళ్ళకికూడా భయమే, లేకుంటే కాళ్ళూ, చేతులూవోరిసి వుచ్చిపోయివుండవూ యీపాటికి' అంది. మీ పదినె కాళ్ళూ, చేతులూ, యెప్పుడూ వోరిసి వుచ్చి వురుగు

లోడుతూ వుంటాయి. ఆసుపత్రినుంచి నేననేకసార్లు మందు తెచ్చియిచ్చేను. నేను చెయ్యగలతని అంతే. తనెప్పుడూ తనకు తోచి మందుపెట్టుకున్న పాపాన్ని పోలేదు. నేను పోరగా పోరగా యెప్పుడేనా మందు పెట్టుకునేది.

"తెల్లారింది. ప్రయాణపు బడలికచేత ఆరింటికి లేచింది. నౌకరీవాడు వచ్చేడు. వచ్చినవెంటనే నాలుగుతిట్లు తిన్నాడు, 'ఇంతఆలస్యంగా వచ్చావేం వెధవా?' అన్నది మొదటి వాక్యంగా. ఆతిట్లు చెవుల్లో పడి నేనూ లేచి మళ్ళా రెండు నెల్లకి విన్నానుకదా యీ కంఠస్వరమని మనస్సులోపల సంతోషించేను. వాడు 'అమ్మగారూ, అగ్గిపెట్టె యిత్తారా అండి, కుంపటి యెలిగిత్తా కాఫీకి' అన్నాడు. 'అగ్గిపెట్టె అడుగుతా వుట్రా వెధవా? నువ్వు ముట్టుకుంటే అగ్గిపెట్టె మొందుకేనా పని కొస్తుందిట్రా, పెంటమీద పారేసుకోవాలికాని? నీఅనాచారం పనులు నాదగ్గిర పనికిరావు, నీఅయ్యవారిదగ్గిరగాని' అని మొదలెట్టింది. వాడు వూరుకున్నాడు. ఒక తాటికమ్మ పట్టుకొచ్చేడు. అది వెలిగించి యిచ్చింది ఆవిడ...... పళ్లు తోముకుంటూ వుంటే కాపది వచ్చింది. వచ్చి 'అమ్మగా రొచ్చేరా అండి. చాలాకాల మయిందండి యెల్లి' అంది. ఆమాటలకి జవాబు కమోసు! 'ఇంత ఆలస్యంగా వచ్చేవేం? ఇంకా అయ్యగారే పనిచేస్తున్నా రనుకున్నావేమిటి? ఎవళ్లేనా బ్రాహ్మలన్న వాళ్ల యింట్లో, యిప్పుడా పాచిపని చేస్తారు. అడిగేవాళ్ళు లేకగాని?' అని మొదలెట్టి కోపపడింది. అది వూరుకుంది. కాలకృత్యాలయ్యేక అంట్లు-అంటే కుక్కరుగిన్నెలు-దాసీదానికి పడేసింది. నేను వంటింటిపక్కని వసారాలో కూచున్నాను, చంటిపిల్లాణ్ణి దగ్గిరపెట్టుగుని. మీ వదినె వంటగదిలో కాలుపెట్టి వొక్క-

గంతు యీావలికి వేసింది. వేసి, 'నరకం, నరకం, మహానరక మంటే నమ్మండి. మహాప్రభో, యిలాంటి కొంపలో నాబోటి దొక్కక్షణమేనా వుండగలదా? నేను వెళ్ళేటప్పు డెలాగుంది? ఇప్పు డెలాగుంది? ఏమేనా అంటే నానోరు బయటపడడమే గాని... ...' అని వోకచిన్న ఉపన్యాస మిచ్చి 'వారంరోజుల వరకూ యిల్లు సవరించుకోడమే అయిపోతుం' దని సూచించి సంస్కరణ మొదలుపెట్టింది. ఇంట్లోవున్న వుప్పులు, పప్పులూ-నే ననాచారంగా ముట్టుకున్నానుగా మరి; అంచేత పనికిరావు-దాసీ దాని కిచ్చేసింది. నూనినేతిగిన్నె లివతలపారేసింది. పోపుసామగ్రి వాకిట్లోకే వచ్చింది. బుట్టలూ, తట్టలూ గోడవతల విసిరేసింది. ఇంట్లోవున్న బిందెదగ్గరనుంచి గుళ్ళీవరకు యివతల పడేసింది. ఇవన్నీ దాసీది తోమడానికే! నేను మాటాడకుండా అవతలికి వెళ్ళిపోయేను; చెప్పి లాభమేమీ నాకు కనబడలేదు, అంచేత. ఇల్లంతా గోడలదగ్గిరనుంచి, పీటలదగ్గిరనుంచి కడిగేసింది. అంత పనీ అయేప్పటికి తొమ్మిదింపావు అయింది. అప్పుడు బిందెపట్టుకుని గోదావరికి స్నానానికి బయలుదేరింది. ఒక అరగంటలో వచ్చింది. పొయ్యిలో నిప్పువేసింది. ఆఫీసుకి వెళ్ళడానికి నేను కోటుగట్రా వేసుగున్నాను. 'ఓయ్! మధ్యాన్నం సెలవుపుచ్చుగు వస్తా భోజనాని' కన్నాను. 'రండి అప్పటికి తెములుతుంది లెండి' అంది. నేను ఆఫీసుకి బయలుదేరేను. మా పెద్దబ్బాయికి దారిలో హొటేలులో భోజనం పెట్టించి స్కూలుకు దిగబెట్టేను.

మధ్యాన్నం వచ్చి భోంచేసేను. సాయంత్రమయింది. షికారు అలవాటు తప్పిపోడంచేత యింట్లోనే కూచున్నాను. దాసీది వచ్చింది. అంట్లగిన్నెలు అవతల పారేసింది మీావదిన. అంట్లు

తోమింది దాసేది. దాసిది ఇల్లూడ్చింది, ఆవులసాలలో పని అంతా చేసింది. ఇంక వెళిపోతానంది. అది వెళిపోతానంటే యేదోపని పురమాయించింది, మీావదిన. అబ్బాయీా! నే నెప్పుడూ కూడా చూడలేదు, దాసీదికాని, నౌకరుకాని యింటికి పోతానంటే సంతోషంతో మీావదిన యింటికి వెళ్ళమనడం. ఏదోపని పురమాయించి వాళ్ళు యేమనుస్తావుంటే పంపడం. నెల అయినవెంటనే వాళ్ళకి యెన్నడూ సరిగ్గా జీతంరాళ్ళు యిచ్చి యెరుగదు. నాలుగు రోజులు ఆలస్యంచేసో, లేక ఏదోకొంత యిచ్చేసి కొంత అట్టే పెట్టుగునో, యేదో యిలాగే చేస్తూవుం టుంది. నెలాఖరున వెంటనే జీతమిచ్చేస్తే వాళ్ళకి బద్ధకం బలిసి పోతుందిట. ఆ జ్ఞానం మరెవరికీలేదు. గవర్నమెంటువారు యీా తెలివిలేకే మాకు నెలఅయిన వెంటనే జీతమిచ్చేస్తున్నారు...... దాసీది వెళిపోయింది. ఆతర్వాత అన్నంగిన్నె తీస్తూవుంటే దీపం దగ్గిర రవ్వంతమసి కనపడినట్టనిపించి అంచుకింద నిదానంగా చూసింది, చూస్తే ఆవగింజలో సగమంతమసి కనపడింది. దానితో దాసీదానిమీాద మండిపడిపోయి, తప్పేలా తోముకుని, నూతిదగ్గిర స్నానంచేసింది.

"అటుతర్వాత వంటకి పొయ్యిలో నిప్పువేసింది. అప్పుడు నేను అన్నాను, 'పోనీ కుక్కరుతో వండు. కుక్కరువంటరుచి నీకు తెలుస్తుంది. మరింక విడిచి పెట్టవు' అని. 'ఆకుక్కర్లు గిక్కర్లు నాకు పనికిరావు, మీావంటలకేగాని. మనుష్యజాతి పుట్టినదగ్గిర నుంచీ వుంది యీా వంట' అంది. దానికి నేను 'ఉండవచ్చులే. అదికాదు నేను చెప్పేది. నీకు పని తెరిపివుంటుంది. ఎందుకలా హూనమయిపోతావు పొయ్యిదగ్గిర? రెండుగంటలవరకేవు పొయ్యి దగ్గిరే కనిపెట్టుకుకూచుంటావు. పొగవల్ల కంళ్లుచెడిపోతాయి. వేడి

వల్ల వొళ్లు చెడిపోతుంది. మరి కుక్కరయితే అయిదునిమిషాలలో పనిఅంతా పూర్తిచేసుకుని మరొకగంటసేపటికి వచ్చిభోంచెయ్య వచ్చు' అన్నాను. అందుకు తాను 'దానిరుచి బాగుండదు' అంది. 'అవును, దానిరుచి దానిది, పొయ్యివంటరుచి పొయ్యి వంటది. బూర్లరుచి బూర్లది, గార్లరుచి గార్లది. ఒకదానితో వొకటి పోల్చగలమా' అన్నాను. ఏమైనా దాన్ని వొప్పించ లేక పోయేను. పోనీకదా అని అప్పటికి వూరుకున్నాను. మరొ కప్పటికి వాయిదా వేసేను. వంటయేక భోంచేసి నిద్రపోయేము.

"మర్నాడు పొద్దున్న యేదో పెద్దపనివున్నట్టుగా పెంద్రాడే లేచింది మీవదిన. దాసీదాన్ని రానిచ్చి దానిదగ్గిర ఒకగంట న్నరసేపు లెక్చరిచ్చింది, నిన్న గిన్నెకు మసివుండడంమీద. అది యింటిదగ్గర వున్నంతసేపూ కుమ్మరి పురుగుగొలికినట్టుగా గొలికేసింది. అది యెవ్వడేనా ఖర్మంచాలక ఒకమాట అంటే చాలు, మ ల్ల మరొకమాటు పెళపెళ మనిపించేసేది. 'భోంచేస్తూ వుంటే నాతో చెప్పింది, 'దాసీదాన్ని యివాళ ఝూడించి విడిచి పెట్టేసేనండి' అని. అందుకు నేను 'నీమీద యెంతతప్పున్నా నే నెప్పుడేనా నిన్ను ఝూడించి విడిచిపెట్టేసేనా' అనిఅడిగేను. దానితోటి మొహం ఆల్చిప్పంత చేసుకుంది. సాయంత్రంవరకూ ధుమధుమలాడుతూనేవుంది. నాతో మాటాడలేదు. పోనీ అని నేనూ వూరుకున్నాను. రాత్రి రాజీపడ్డాం.

" అబ్బాయీ! ఎందు కిన్ని చెప్పడం. మళ్లీ మొదలు—— కూరగాయలదానితోటి, బియ్యపుమనిషితోటి, అపరదినుసులు తెచ్చే మనిషితోటి——ఒకటేమిటి ఒక అరగంటసేపు వాదిస్తే గాని ఒకకూరగాయేనా కొనదు. నిన్నటికినిన్న దాసీది పిడకలు తిరగవెయ్యలేదని గంటన్నరసేపు లెక్చరిచ్చింది. ఈఘటనలే

నాకూ వచ్చేవి. కాని నేను దాసీమనిషితో 'ఆపిడక లివాళ తిరగవెయ్యాలి' అని ఒకమాట అనేవాణ్ణి. అది తిరగవేసేది. ఒక్కమాటతో తెమిలిపోయేదానికి ఒకగంటన్నరసేపు వుపన్యాసమివ్వడం. ఇదీ ఆడదాని స్వభావం. ... ... ...దాసీది చెప్పిందిట, నేను దానికి రాచ్చిప్పలూ, పాలకుండా తోమడానికి వేసేవాణ్ణనీ, రుబ్బురోలు దానిచేతే కడిగించేవాణ్ణనీ. అంచేత రాచ్చిప్పలూ, పాలకుండా దానికిచ్చేసింది. రుబ్బురోలుమీద పసువునీళ్లు చల్లి పదిబిందెల పేడనీళ్లతో శుద్ధిచేసింది. ఇంకెందుకిన్నిసార్లు చెప్పడం, స్నానాలూ, కడగడాలూ, నీళ్లలో మునిగితేలుతూవుండడం మళ్లా మొదలు... ఆఫీసువేళకి సరిగ్గా వంటచేసిపెట్టిన రోజు లేదు. లేనిపోని పనులు కల్పించుగుంటూవుంటే వేళ కెక్కడ వండగలదు? రాత్రి పదకొండింటికికూడా యిల్లు కడుగుతూన్న చప్పుడే, అవెన్నిపను లున్నాయో యేమిటో?

"నూతిదగ్గర పొరుగువాళ్లతో యుద్ధమైపోతూవుంటుంది రోజురోజూ. ఒకొక్కప్పుడు మహాభారతయుద్ధమంత అయిపోతూవుంటుంది. నిన్న పక్కయింటివాళ్లయింట్లోంచి కాకి అన్నంకెరడు యెత్తుకుపోయి మాపెరడుమీదుగా యెగురుతూ పోగా పెరట్లో నాలుగుమెతుకులు రాలేయి. దానికోసమని పక్కయింటివాళ్లతో తగవులాడింది! ఏమని చెప్పమన్నావు, పగలు పన్నెండుగంటలూ యీమోస్తరుగానే కాలక్షేపమయిపోతుంది. పుస్తకం ముట్టడానికేనా అవకాశముండదు. ఈ మోస్తరుగా కాలక్షేపం చెయ్యడం మనతరంకాదు. ఏదైనా దాన్ని యెప్పుడూ పల్లెత్తుమాట అని యెరగను. తిట్టడంగాని, కొట్టడంగాని యెన్నడూ లేదు. తిట్టడంవల్లా, కొట్టడంవల్లా బాగుపడ్డ సంసారం యింతవరకూ నాకు ఒక్కటేనా కనబడ లేదు. అంచేత

నే నెప్పుడూ దాన్ని యేమీ అనను. నేను చేసే పనేమిటంటే సలహా చెప్పడం, హితోపదేశం చెయ్యడం. అంతే. ప్రేమ, దయవల్ల జయించవలసిందేకాని దీనికి మరొకదారి లేదు. ముమ్మాటికీ లేదు.

“ నా ఒక్క సంసారమే యిలాగ వుందనుకుంటున్నావేమో! అన్నిసంసారాలూ యింతే. కోటి కెక్కడైనా ఒకటి వేరుగా వుందేమో! అంచేతే నాకు ప్రత్యేకవిచారం లేదు.” చదువు కొన్నవాడికీ, చదువుకోని ఆడదానికీ సంసారంచెయ్యడంలో యింత తేడావుంగకదా అని నాకు ఆశ్చర్యం వేస్తూవుంటుంది. ఏపనికయినా చదువు అవసరమే. చదువుయొక్క లాభం తెలిసేక ఆడవాళ్లకి చదువువద్దన్నవాళ్లని గుండేసి కొట్టేసినా పాపం రాదు అని అనిపిస్తూంది. నిన్ను మీ పెద్దపిల్లని చదువులో ప్రవేశపెట్టమని అంటూవుండడం చదువు వుపయోగ మెరిగే. అంతా క్షేమం.

ఇట్లు : నీప్రియసోదరుడు,

సూర్యారావు ”

